

ఓటమి పాలైనా.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● పాకలపాటి రఘువర్మ

విశాఖపట్నం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను ఓటమి పాలైనప్పటికీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాకలపాటి రఘువర్మ అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడడానికి కొద్ది నిమిషాలు ముందు ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఓటమిని అంగీకరిస్తున్నానని, అయితే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మాత్రం పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని స్పష్టం చేశారు.

● ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో శ్రీనివాసులునాయుడు విజయం
● ఉత్కంఠ భరితంగా సాగిన ఓట్ల లెక్కింపు
● ముగ్గురి మధ్య హోరాహోరీ
● తొలి రౌండ్ నుంచీ గాదెకు స్వల్ప మెజారిటీ
● తాజా విజయంతో మూడోసారి మండలిలోకి...


ఎమ్మెల్సీ గద్దెపై గాదె



ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు



గాదె శ్రీనివాసులునాయుడు



విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు తొలి రౌండ్ నుంచి ఉత్కంఠ భరితంగా సాగింది. చివరకు ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో గాదె తన సమీప ప్రత్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మపై గెలుపొందారు. పది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంత వరకు ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది.

గత నెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా, ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం ఆంధ్ర విశ్వ విద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల (ఈఈఈ భవనం)లో చేపట్టారు. ఆరు జిల్లాల పరిధిలోని 123 బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను లెక్కించేందుకు 20 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు స్ట్రాంగ్ రూమ్ తెరిచి అభ్యర్థుల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్‌కు తీసు కువచ్చారు. బాక్సుల్లోని బ్యాలెట్ పత్రాలను బయటకు తీసి 25 చొప్పున కట్టలు కట్టి డ్రమ్ముల్లో వేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి 11 గంటలు అయ్యింది. ఆ తరువాత ఒక్కో టేబుల్‌కు వేయి చొప్పున సర్దుబాటు చేశారు. వీటిని ఏజెంట్ల సమక్షం లో ఆయా టేబుళ్లకు కేటాయించిన సిబ్బంది లెక్కిం చారు. మొత్తం 20,794 ఓట్లు పోల్ కాగా, 20,135 ఓట్లు చెల్లినవిగా, 659 ఓట్లు చెల్లనవిగా గుర్తించారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. మొదటి ప్రాధాన్య ఓట్లలో గాదె శ్రీనివాసులు నాయుడుకు 7,210, పాకలపాటి రఘువర్మకు 6,845, కోరెడ్ల విజయగౌరికి 5,804 రాగా, మిగిలిన ఏడుగురు అభ్యర్థులకు వందకంటే తక్కువ వచ్చాయి. విజేతను ప్రకటించాలంటే పోలైన ఓట్లలో 50 శాతం కంటే అదనంగా ఒక్క ఓటైనా రావాలి. అంటే చెల్లిన ఓట్లు (మిగతా 7వ పేజీలో..)



సూదికొండ ప్రాంతంలో ప్రభుత్వ భూములు..


అంత భూమి లేదంట!

● రెండు ఎకరాలు మాత్రమే ఇస్తారంట
● సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు రెవెన్యూశాఖ మోకాలడ్డు
● కేంద్రం అనుమతిచ్చినా.. వెంటాడుతున్న స్థల సమస్య
● జీడి పరిశోధన కేంద్రం వెనక్కి వెళ్లే పరిస్థితి
● ప్రభుత్వం చొరవ చూపాలని రైతుల విజ్ఞప్తి

పలాస, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పలాసలో జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు స్థల సమస్య వెంటాడుతోంది. జీడి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానంతో పలాసకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)ని మంజూరు చేసింది. ఇందుకోసం కనీసం 25ఎకరాల ప్రభుత్వ భూమి కావాలని ఉద్యానవన శాఖ అధికారులకు తెలియజేసింది. ఆ మేరకు స్థలం గుర్తించాలని స్థానిక కూటమి నేతలు, అధికారులు.. రెవెన్యూ అధికారులకు సూచించారు. కాగా.. వారు అంత భూమి తమ వద్ద లేదని, సూదికొండ ప్రాంతంలో ఉన్న రెండు ఎకరాల పోరంబోకు భూమి ఇవ్వగలమని సూచన ప్రాయంగా తెలియజేయడంతో నేతలు, అధికారులు ఖంగు తినాల్సి వచ్చింది. జీడి పరిశోధన కేంద్రం ఏర్పడాలంటే కనీసం 25 ఎకరాలకు పైగా స్థలం అవసరం. నీరు కూడా అందుబాటులో ఉండే స్థలాలు కావాల్సి ఉంది. ఎందుకంటే ఇక్కడ జీడి పంటలకు సంబంధించి అన్నీ రకాల ప్రయోగాలు జరుగుతాయి. కొత్త వంగడాలు, చీడపీడల గుర్తింపు, విత్తన శుద్ధి, ఆధునిక సాగు వంటివి చేపడతారు. మొత్తం ప్రక్రియ సక్రమంగా నడవాలంటే సారవంతమైన భూములు కావాల్సి ఉంది. అయితే సర్వేనెంబరు 51లో ఉన్న భూములు కావాలంటే ఇవ్వగలమని రెవెన్యూ అధికారులు (మిగతా 8వ పేజీలో..)

మూలపేట పోర్టు నిర్మాణం డొల్ల

● అసెంబ్లీ సాక్షిగా బయటపెట్టిన మంత్రి అచ్చెన్న
● నాడు వైసీపీ నేతల హడావుడే మిగిలింది



మంత్రి అచ్చెన్న

టెక్కలి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలంలో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణమంతా డొల్లని తేలింది. ఇప్పటివరకు ఈ పోర్టుకు రూ.1,155 కోట్లు మంజూరు చేయగా.. అన్నివిధాలా ఖర్చు చేసింది రూ.240 కోట్లేనని అసెంబ్లీ సాక్షిగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం బహిర్గతం చేశారు. మూలపేట పోర్టుకు 2023 ఏప్రిల్ 19న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 826 ఎకరాల్లో రూ.4,361.91కోట్లతో పోర్టు నిర్మాణం చేసి మొదటి ఫేజ్‌లో 23.5ఎంటీపీఏ ఎగుమతి, దిగుమతులకు, అలాగే నాలుగు బెర్త్‌లు (రెండు జనరల్ కార్గో, ఒక కోల్, ఒక మల్టీ పర్పస్) రవాణాకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి 2,455 మీటర్ల సౌత్‌బ్రేక్ గోడ, 580 మీటర్ల నార్త్‌బ్రేక్ గోడ నిర్మాణ పనులు ప్రారంభించారు. డ్రెజ్జింగ్ పనులు కూడా ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. అలాగే పోర్టుకు సంబంధించి భూసేకరణ, ఉప్పు భూములు, రైల్వే భూముల సేకరణ, నిర్వాసితుల సమస్యలేవీ పరిష్కారం చూపలేకపోయారు. ఎన్నికల ముందు వైసీపీ ముఖ్య నాయకులు వైవీ సుబ్బారెడ్డి, పరి శ్రమల శాఖ మాజీమంత్రి అమర్‌నాథ్, మాజీమంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పోర్టు ప్రాంతం లో పర్యటించారు. మూలపేట పోర్టు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.. షిప్ వచ్చేస్తుందని హడావుడి చేసి ఓటర్లను నమ్మబలికే ప్రయత్నం చేశారు. పోర్టు నిర్మాణంలో వేలమంది స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ప్రకటించారు. కాగా.. నేడు అసెంబ్లీ వేదికగా.. అవన్నీ ఉత్తుత్తివేనని తేలిపోయింది. మాటలే తప్ప పనులు వేగవంతం కాలేదని నిరూపితమైంది. మొత్తంగా పోర్టు నిర్మాణ భారం కూటమి ప్రభుత్వంపై పడింది.



మూలపేట పోర్టు పనులు (ఫైల్)

ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలి



పాతపట్నం: **పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు** మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సాగునీట సౌకర్యాలు లేక తమ ప్రాంత రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదన్నారు. ఈ క్రమంలో కుటుంబ పోషణ కోసం చాలామంది వలస పోతున్నారని తెలిపారు. పారిశ్రామికాభివృద్ధికి కృషి చేసి.. వలసల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలి



రణస్థలం: **ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు** మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో అన్నివిధాలుగా వెనుకబడిన ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని ఆదుకోవాలని కోరారు. సాగునీటి సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. 'వైసీపీ పాలనలో ఎన్నో సమస్యలు గాలికొదిలేసి వ్యక్తిగత ప్రయోజనాలు చూసుకున్నారు. నారాయణపురం ప్రాజెక్ట్ ఆధునికీకరణకు నిధులు మంజూరైనా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. తోటపల్లి కాలువల్లో కనీసం పూడికతీత పనులు చేపట్టలేదు. మడ్డువలస ఫేజ్ -2కు నిధులు విడుదల చేయలేదు. దీంతో రైతులు సాగునీటికి ఇబ్బందులు పడ్డారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో నారాయణపురం, మడ్డువలస, తోటపల్లి కాలువల పనులు పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. బుడుమూరు పెద్ద చెరువును మినీ రిజర్వాయర్‌గా చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ప్రాజెక్టులపై దృష్టి సారించి.. నిధులు మంజూరు చేయాల'ని ఎమ్మెల్యే ఎన్ఈఆర్ కోరారు.

ఐటీడీఏ కోసం ఎమ్మెల్యేల పట్టు

● శాసనసభ సమావేశాల్లో ప్రస్తావన
● మెళియాపుట్టి కేంద్రంగా ఏర్పాటు చేస్తాం
● గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి

పలాస/ ఆమదాలవలస, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు కోసం జిల్లా ఎమ్మెల్యేలు తమ గళం వినిపించారు. ఇక్కడి గిరిజనులు తమ పనుల కోసం పొరుగు జిల్లాలోని ఐటీడీఏకి వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం మినీ ఐటీడీఏని ఏర్పాటు చేయాలని వారు కోరారు.



● **పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష** మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలను అడ్డగోలుగా విభజించడం వల్ల సిక్కోలు అన్యాయం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం మినీ ఐటీడీఏ మంజూరు చేయాలని కోరారు. పాతపట్నం, మెళియాపుట్టి, పలాస, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో ఎక్కువగా గిరిజనులు ఉన్నారని, వారు పార్వతీపురం మన్యం జిల్లాలోని ఐటీడీఏకి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఐటీడీఏలు స్థాపించి గిరిజనుల బతుకుల్లో వెలుగు నింపింది టీడీపీ ప్రభుత్వమేనని, ఇప్పుడు సీఎం చంద్రబాబు కూడా జిల్లాకు మినీ ఐటీడీఏ మంజూరు చేయాలని కోరారు.



● **ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్** మాట్లాడుతూ ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో ఉన్న శ్రీకాకుళం పాలకొండ నియోజకవర్గం మన్యం జిల్లాలోకి, రాజాం విజయనగరం జిల్లాలోకి మారడంతో ఇక్కడి గిరిజనులు ఐటీడీఏ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా 13 జిల్లాలను 26 చేసిందే తప్ప గిరిజనుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. నాటి సీఎం ఎన్టీ రామారావు గిరిజనులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐటీడీఏ లక్ష్యాలను వైసీపీ విస్మరించిందని ఆరోపించారు. జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటుకు మెళియాపుట్టి, మందస ప్రాంతాలను గుర్తించినట్టు తెలిసిందని, తక్షణమే సంబంధిత మంత్రి దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన కోరారు. దీనిపై గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పందిస్తూ.. మెళియాపుట్టి కేంద్రంగా త్వరలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఐటీడీఏ కేంద్రం ఏర్పాటుపై గత ప్రభుత్వంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మధ్య పొంతన లేకపోవడమే ఆలస్యానికి కారణమైందని తెలిపారు.

గంజాయి మత్తులో ఘాతుకం



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ మూర్తి తదితరులు

● నరసన్నపేటలో వృద్ధురాలు దారుణ హత్య
● వివస్త్రను చేసి చంపేసి.. రోడ్డుపై ఈడ్చుకెళ్లి..
● కాసు బంగారం కోసం దారుణం
● ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ, అడిషనల్ ఎస్పీ



గన్నెమ్మ (ఫైల్)

నరసన్నపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బంగారం ఆభరణాల కోసం ఆగంతుకుడు ఓ వృద్ధురాలిని హత్య చేశాడు. వేకువజామున పూలు ఏరుతున్న సమయంలో ఆమె నోరు మూసేసి.. బంగారు ఆభరణాలను తస్కరించాడు. గంజాయి మత్తులో ఆమెను వివస్త్రను చేసి.. ఈడ్చుకుంటూ వెళ్లి మృతదేహాన్ని రోడ్డుపై పడేశాడు. సోమవారం నరసన్నపేటలో జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నరసన్నపేట మండలం బొంతలవీధికి చెందిన కేవీటీ గన్నెమ్మ (85) హత్యకు గురైంది. రోజూ ఈమె సత్యనారాయణ నగర్, కామేశ్వరి నగర్‌లో చెట్లకు ఉన్న పూలు ఏరి ఆలయాల వద్ద భక్తులకు ఇచ్చేది. వారు ఇచ్చిన డబ్బులతో కుమారుడి వద్ద ఉంటూ జీవనం సాగించేది. అలా ఈ ప్రాంతంలో పువ్వుల అవ్వగా పేరొందింది. కాగా రోజూ మాదిరి సోమవారం వేకువజామున 3 గంటలకు పువ్వుల కోసం ఆమె బయటకు వెళ్లింది. ఆ సమయంలో గంజాయి మత్తులో ఉన్న ఓ ఆగంతుకుడు.. ఆమె ముక్కుకి పెట్టుకున్న బేసర్లు (బంగారం ఆభరణాలు) తస్కరించేందుకు ప్రయత్నించాడు. ఆమె మెడపై చేయి వేసి.. నోరును మూసేసి సత్యనారాయణస్వామి ఆలయంవైపు తీసుకెళ్లాడు. అక్కడ ఆ బంగారు ఆభరణాలను తస్కరించాడు. ఆ సమయంలో ఏమి చేశాడో.. కానీ ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఆమెను ఈడ్చుకుంటూ వెళ్లి.. వివస్త్రగా చేసి కామేశ్వరి నగర్‌కు వెళ్లే మార్గంలో మృతదేహాన్ని పడేశాడు. సోమవారం ఉదయాన్ని స్థానికులు ఆ వృద్ధురాలి మృతదేహాన్ని చూసి ఆందోళన చెందారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముందు గుర్తుతెలియని మృతదేహంగా అనుమానించారు. ముక్కు భాగం వద్ద రక్తం కారడంతో బంగారం ఆభరణాలు కోసం హత్య జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. సమీపంలో ఇళ్లను వాకబు చేశారు. ఈ క్రమంలో వేకువజామున వెళ్లిన తన తల్లి.. ఉదయమైనా ఇంటికి రాలేదని బొంతలవీధికి చెందిన (మిగతా 8వ పేజీలో..)

ఎస్పీ పరిశీలన

ఘటనా స్థలాన్ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ(క్రైం) శ్రీనివాసరావు, టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు దుర్గాప్రసాద్, అశోక్‌బాబు పరిశీలించారు. సీఐ శ్రీనివాసరావు సకాలంలో స్పందించి ఆ ప్రాంతంలో సీసీ పుటేజీలను పరిశీలించి ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. క్లూస్‌టీం సభ్యులు కూడా పరిశీలించి ఆ ప్రాంతంలో కొన్ని ఆనవాళ్లను గుర్తించారు. బంగారం ఆభరణాల కోసం ఓ ఆగంతుకుడు ఈ హత్యకు పాల్పడినట్టు నిర్ధారించారు. ఈ క్రమంలో స్థానిక పురుషోత్తనగర్‌కు చెందిన ఒక యువకుడ్ని అనుమానంతో అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఆ యువకుడు గతంలో బాల నేరస్థుడుగా పలు నేరాలకు పాల్పడినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నా మని, నిందితుడ్ని పట్టుకుంటామని టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. గన్నెమ్మ కుమారుడు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

మానవ సేవే.. మాధవ సేవ

● త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి
● టెక్కలిలో శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

8లో



ఒడిశా నుంచి గంజాయి రవాణా

● మహారాష్ట్ర, మాల్దీవులకు.. ● రెండు వేర్వేరు కేసుల్లో నలుగురి అరెస్ట్
● వివరాలను వెల్లడించిన డీఎస్పీ వెంకట అప్పారావు

8లో



శ్రీకాకుళంలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినులు

ఇంటర్ ద్వితీయ పరీక్షలు ప్రారంభం

● 337 మంది గైర్హాజరు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నరసన్నపేట/ గుజరాతీపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 75 కేంద్రాల్లో తెలుగు, సాంస్కృతం పరీక్షలు నిర్వహించారు. మొత్తం 18,782 మంది విద్యార్థులకుగానూ 18,445 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 337 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి మాల్‌ప్రాక్టీసు నమోదు కాలేదని ఆర్ఐవో ప్రగడ దుర్గారావు తెలిపారు.

ఒడిశా వాసుల బరితెగింపు

- ఆంధ్రా భూ భాగంలో అక్రమ నిర్మాణం.. ఆపై బెదిరింపులు
- అధికారులకు కొజ్జిరియా వాసుల ఫిర్యాదు



అక్రమణ స్థలాన్ని పరిశీలిస్తున్న కవిటి ఎస్ఐ

కవిటి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్ర సరిహద్దు గ్రామస్థులు ఆంధ్రా భూ భాగంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై నిలదీసిన ఆంధ్రా సరిహద్దు గ్రామస్థులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ విషయమై మండల అధికారులకు ఆంధ్రా గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రా సరిహద్దు కవిటి మండలం కొజ్జిరియా పంచాయతీ పరిధి ఒడిశా-ఆంధ్రా సరిహద్దులోని 91-20ఏ సర్వే నెంబరులో 4.25 ఎకరాల భూమి ఉంది. అందులో కొంత ఆంధ్రా భూభాగం ఉంది. ఒడిశాలోని చీకటి బలరాంపురం గ్రామస్థులు ఆ స్థలంలో ఉన్న ఎత్తైన కొండకు రంగులు వేసి అక్కడ ఉన్న గోతులు కప్పి రోడ్డు నిర్మాణం చేపట్టడంతో వివాదానికి దారితీసింది. ఆంధ్రాలో ఉన్న భూమిలో ఒడిశా వారు ఎందుకు ఇలా చేస్తున్నారని కొజ్జిరియా గ్రామస్థులు సామరస్యంగా చర్చించుకునేందుకు సిద్ధమయ్యారు. కొజ్జిరి యా పంచాయతీ వాసులంతా చర్చలకు సిద్ధమైనా చీకటి బలరాంపురం గ్రామానికి చెందిన వారు రాకుండా ఈ స్థలంలో ఆలయం పేరిట బోర్డును ఏర్పాటు చేశారు. చర్చించుకొని పరిష్కరించుకోవాల్సిందిపోయి చీకటిబలరాంపురం వాసులు బెదిరింపులకు పాల్పడుతున్నారని కొజ్జిరియా వాసులు చెబుతున్నారు. దీనిపై మండల తహసీల్దార్, ఎస్ఐలకు ఫిర్యాదు చేశామని సర్పంచ్ ఉప్పాడ నీలమ్మ, గ్రామ పెద్దలు పద్మనాభం, దేవేంద్ర తదితరులు తెలిపారు. ఈ మేరకు సోమవారం కవిటి ఎస్ఐ వి.రవివర్మ ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించి తహసీల్దార్ ద్వారా సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామని తెలిపారు.



ఆంధ్రా స్థలంలో నిర్మించిన రహదారి

అటవీ భూములు కాపాడాలని వినతి

ఎచ్చెర్ల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): బడివానిపేట పంచాయతీలోని అటవీ భూములను కాపాడాలని మాజీ సర్పంచ్ వారది ఎర్రయ్య, గ్రామస్థులు కలెక్టర్, జిల్లా అటవీ శాఖాధికారులను సోమవారం కలిసి వినతిపత్రాలు అందించారు. ఇప్పటికే ఆక్రమణలో ఉన్న అటవీ భూములను విక్రయించేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని విన్నవించుకున్నారు. ఈ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయానికి సిద్ధమవుతున్నారని, దీనిని అడ్డుకుని అటవీ భూములను పరిరక్షించాలని కోరారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి

అరసవల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునిల్‌కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఏఐఎం, దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో నిరసన చేపట్టారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా అంబేడ్కరిస్ట్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సునీల్ కుమార్‌పై సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆయన సస్పెన్షన్ వెనుక కుట్ర కోణం దాగి ఉందని కంఠ వేణు అన్నారు. కార్యక్రమంలో గురుమూర్తి, పురుషోత్తం, రాంబాబు, చంటి. భూషణ్, అబ్బాస్, సత్యన్నారాయణ, రమణ, రాజు, మహేష్, మల్లేశ్వరి, రాజేశ్వరి హారతి, తదితరులు పాల్గొన్నారు.

128 మందికి కంటి పరీక్షలు

రణస్థలం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సూర్య ఆసుపత్రి ప్రాంగణంలో జిల్లా అందత్వ నివారణా సంస్థ సౌజన్యంతో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు సోమవారం నిర్వహించారు. 128మందిని పరీక్షించగా, 33 మందిని శస్త్ర చికిత్సకు వైద్యులు గుర్తించి విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు ఇడదాసుల వెంకటసత్యనారాయణ, అధ్యక్షుడు తిరుపతిరాజు, యశ్వంత్, శీనివాసరావు, బేతా నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ఉపాధ్యాయుల వివరాలు ఇవ్వండి

గుజరాతీపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాల విద్య అమరావతి కార్యాలయంలోగల విద్యా సమీక్ష కేంద్రంలో డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు ఆసక్తి, అర్హులైన ఉపాధ్యాయుల వివరాలను పంపించాలని ఎంఈవోలను డీఈవో తిరుమల చైతన్య ఒక ప్రకటనలో కోరారు. ఆయా ఉపాధ్యాయులకు డిప్యూటేషన్ ప్రాతిపదికన పనిచేసేందుకు, కంప్యూటర్ నైపుణ్యంతోపాటు గణిత శాస్త్రపై పట్టున్న ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లను గుర్తించాలని కోరారు. ఈ నెల 5వ తేదీలోగా వివరాలు పంపించాలని పేర్కొన్నారు.

మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు రేపు

శ్రీకాకుళం స్పోర్ట్స్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు, మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలను స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ పేర్కొన్నారు. ఈ పోటీలు ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా ఈ నెల 5న నిర్వహించనున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, 100 మీటర్ల పరుగులు, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్ వంటి పోటీలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు ఎం.మాధురీలత సీనియర్ కోచ్‌ను సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా నగర సంకీర్తన

శ్రీకాకుళం కల్చరల్ ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నగరంలో హరేకృష్ణ హరేరామ సంస్థ ఆధ్వర్యంలో హరేకృష్ణ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అరసవిల్లి నుంచి డే అండ్ నైట్ వరకు మహానగర సంకీర్తన నిర్వహించారు. సాయంత్రం ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు సందర్భంగా రఘుపాత్రుడు శ్రీకాంత్ బృందం ఆధ్వర్యంలో చేపట్టిన భరతనాట్య నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

8న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ సబ్ జూనియర్ బాలురు, బాలికల పోటీలకు జిల్లాస్థాయి ఎంపికలను ఈ నెల 8న నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా చైర్మన్ గొండు శంకర్, అధ్యక్షుడు నక్క కృష్ణారావు, కార్యదర్శి సాధు ముసలినాయుడు తెలియజేశారు. 2009 మార్చి 30వ తేదీ తర్వాత జన్మించి, 55 కిలోల లోపు బరువు ఉన్నవారు అర్హులన్నారు. ఇందులో ఎంపికైన వారు ఈ నెల 14, 15, 16వ తేదీల్లో కడప జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావును సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ సామగ్రి విక్రయిస్తే చర్యలు

ఆమదాలవలస, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్లాస్టిక్ సామగ్రి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని మెట్టక్కివలసలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తున్న వ్యక్తిపై సచివాలయ వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు దాడి చేసి పట్టుకొని ప్లాస్టిక్ సామగ్రి స్వాధీనం చేసుకుని, జరిమానా విధించినట్టు తెలిపారు.

ఎమ్మెల్సీ గద్దెపై గాదె

(ఐదో పేజీ తరువాయి)

20,1345లో 10,067 ప్లస్ ఒకటి... 10,068 ఓట్లను సాధించాలి. అయితే, మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి పోటీలో ఉన్న అభ్యర్థులెవరూ మ్యాజిక్ ఫిగర్ దక్కించుకోకపోవడంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు అనివార్యమైంది.

రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుతో విజయం..

మధ్యాహ్నం భోజన విరామం తరువాత రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. మొదట తక్కువ ఓట్లు లభించిన అభ్యర్థుల రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తూ ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టారు. రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో రెండో రౌండ్‌లో పెదపెంకి శివ ప్రసాద్, మూడో రౌండ్‌లో ఎస్ఎస్ పద్మావతి, నాలుగు రౌండ్‌లో రాధాకృష్ణ, ఐదో రౌండ్‌లో సత్యనారాయణ, ఆరో రౌండ్‌లో శ్రీనివాసరావు, ఏడో రౌండ్‌లో దుర్గాప్రసాద్, ఎనిమిదో రౌండ్‌లో సూర్యప్రకాష్‌ను ఎలిమినేట్ చేశారు. ఎనిమిది రౌండ్లు పూర్తయ్యేసరికి గాదె శ్రీనివాసులునాయుడుకు 7,248 ఓట్లు, పాకలపాటి రఘువర్మకు 6,881 ఓట్లు, కోరెడ్ల విజయగౌరికి 5,872 ఓట్లు లభించాయి. అప్పటికి కూడా ఎవరూ మ్యాజిక్ ఫిగర్‌కు చేరుకోకపోవడంతో మూడో స్థానంలో నిలిచిన కోరెడ్ల విజయగౌరికి లభించిన ఓట్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. ఆమె ఎలిమినేషన్ తరువాత గాదె శ్రీనివాసులునాయుడు 9,237 ఓట్లు, వర్మకు 8,527 ఓట్లతో ఉన్నారు. ఈ క్రమంలో మ్యాజిక్ ఫిగర్ చేరుకోవడానికి మొదటి స్థానంలో నిలిచిన శ్రీనివాసులునాయుడుకు 831 ఓట్లు అవసరమయ్యాయి. ఆ సమయంలో రఘువర్మ కౌంటింగ్ సెంటర్ నుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం శ్రీనివాసులునాయుడు విజయానికి అవసరమైన 831 ఓట్ల కోసం రఘువర్మకు పోలైన ఓట్లను లెక్కించారు. ఈ క్రమంలో శ్రీనివాసులునాయుడుకు 12,305 ఓట్లు వచ్చాయి. దాంతో శ్రీనివాసులునాయుడు విజయం సాధించినట్టు అధికారులు ప్రకటించారు.

మూడోసారి ఎమ్మెల్సీగా..

గాదె శ్రీనివాసులునాయుడు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం ఇది మూడోసారి. విజయనగరం జిల్లాకు చెందిన గాదె అదే ప్రాంతంలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. 2007లో శాసన మండలిని పునరుద్ధరించిన తరువాత ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన శ్రీనివాసులు నాయుడు తొలిసారి విజయం సాధించి శాసనమండలిలో అడుగుపెట్టారు. ఆ తరువాత 2013లో మరోసారి పోటీ చేసి విజయం సాధించిన ఆయన..2019లో జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో మరోసారి పోటీ చేసి విజయం సాధించారు. మొత్తంగా నాలుగుసార్లు పోటీ చేసిన ఆయన మూడుసార్లు ఎమ్మెల్సీగా విజయం సాధించారు.

జనరంజక బడ్జెట్‌పై విమర్శలు సిగ్గుచేటు: మాజీ ఎమ్మెల్సీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్

ఆమదాలవలస, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ జనరంజకంగా ఉండడాన్ని చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు విమర్శించడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు నూకరాజు, నందివాడ గోవిందరావు, కిల్లి సిద్దార్థతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభానికి గురై అతలాకుతలమైతే కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ధైర్యంతో రూ.3.24 లక్షల కోట్లతో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. ఇది అన్ని వర్గాలకు ప్రయోజనం కలిగించేలా ఉందని హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తుంటే ఎటువంటి రాజకీయ అనుభవం లేని వైసీపీ నాయకులు విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. టీడీపీ నాయకులు అప్పలనాయుడు, తంగి గురయ్య, జగన్నాథం, తాడేల వెంకటరమణ లావేటి పూర్ణారావు, నేతింటి జ్యోతి, అప్పలనాయుడు, రమణమూర్తి పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న సుడా చైర్మన్ కొరికాన రవికుమార్

శ్రీకాకుళం రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈ నెల 14న జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్స వేడుకలకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున జనసైనికులు, వీర మహిళలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కొత్తరోడ్ వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్తున్నామని దీనికి సంబంధించిన బాధ్యతలు నియోజకవర్గ నాయకులు వహిస్తారన్నారు. పోసాని అరెస్ట్‌పై మాట్లాడుతూ.. ఏ నాయకుడైనా పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాల లోటుపాట్లపై ప్రశ్నించాలని, వ్యక్తిగత దూషణలు చేయడం దారుణమన్నారు. చేసిన తప్పునకు పోసాని పాతపట్నం రాక తప్పదని అక్కడి ప్రజలకు క్షమాపణ చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు. పార్టీ నాయకులు దానేటి శ్రీధర్, గేదెల చైతన్య, కణితి కిరణ్, పేడాడ రామ్మోహన్, బలగ ప్రవీణ్, కోత పూర్ణచంద్రరావు, కూరాకుల యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం



ట్రై సైకిల్‌పై పరీక్షకు వస్తున్న దివ్యాంగుడు

ఇచ్ఛాపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలి కల ఉన్నత పాఠశాలలో ఓపెన్ ఇంటర్ పరీక్షలు ప్ర శాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం జరిగి న ఇంగ్లీష్ పరీక్షలో 138మంది విద్యార్థులకు గాను 115మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని సెం టర్ చీఫ్ ప్రకాష్ తెలిపారు. ఈ పరీక్షలు ఈ నెల 15వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. డీవోగా నరేంద్రనాథ్ పట్నాయక్, సిటింగ్ స్క్వాడ్‌గా గగణకుమారి వ్యవహరించారు.

ప్రతిష్ఠ పెంచేలా విధులు నిర్వహించండి: ఎస్పీ



ఎస్పీ మహేశ్వరరెడ్డిని కలిసి శిక్షణ పొందిన ఎస్ఐలు

శ్రీకాకుళం క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో పారదర్శకంగా పని చేస్తూ పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచేలా విధులు నిర్వహించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. ఇటీవల అనంతపురం జిల్లా పోలీసు శిక్షణ కళాశాలలో ఎస్ఐలుగా శిక్షణ పూర్తి చేసుకున్న వి.హేమంత్‌కుమార్, టి.వెంకటేష్, ఎస్.శ్రీనివాస్, బి.మోహిని, కె.ప్రేమలదేవి సోమవారం ఎస్పీని జిలా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వీరు గ్రేహౌండ్స్‌లో కొద్ది రోజులు శిక్షణ పొందిన తర్వాత జిల్లాలో పలు పోలీసు స్టేషన్లలో పలు అంశాల్లో శిక్షణ పొందనున్నారు.

కార్మికులను ఆప్కాస్‌లోనే కొనసాగించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉద్యోగుల, కార్మికుల సంక్షేమం కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు అన్నారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆప్కాస్ ఉన్న కార్మికులను ప్రైవేటు కాంట్రాక్టర్లకు బదలాయించడం సరికాదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 11న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణ అప్పలరాజు, గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, అధ్యక్షుడు కె.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాది ఈ బడ్జెట్

అరసవల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో వ్యవస్థలన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శనంలో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాది అని టీడీపీ జిల్లా నాయకులు అన్నారు. ఈ మేరకు వారు స్థానిక 80 అడుగుల రోడ్డులో గల టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాయకులు సింతు సుధాకర్, ప్రధాన విజయరాం, కొమ్మనాపల్లి వెంకటారమరాజు, అంపోలు మూర్తి, తోణంగి వెంకన్నయాదవ్, ఎస్వీ రమణ మాదిగ, చిట్టి నాగభూషణం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం బడ్జెట్ రూపొందించిందన్నారు. సమావేశంలో అంధవరపు సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం గ్యాస్ ఏజెన్సీకి పంపిణీ బాధ్యతలు

పొందూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పొందూరు పట్టణంలో ఉన్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వహణ బాధ్యత రణస్థలం గ్యాస్ ఏజెన్సీకి సోమవారం తహసీల్దార్ ఆర్.వెంకటేష్ అప్పగించారు. గ్యాస్‌బిల్లు కంటె అదనంగా డెలివరీ సిబ్బంది వసూళ్లు చేస్తున్నట్టు మండలకేంద్రం పొందూరులోని మూగోడువీధి చెందిన మహిళలు కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు జిల్లా పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాశ్‌ను కలెక్టర్ ఆదేశించారు. దీంతో డీఎస్‌వోతో పాటు తహసీల్దార్ ఆర్.వెంకటేష్ విచారణ జరిపారు. ఈ విచారణలో బిల్లుకంటే రూ.40 నుంచి రూ.60 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు నిర్ధారణ కావడంతో కలెక్టర్‌కు నివేదిక అందించారు. దీని ఆధారంగా కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ ఆదివారం సాయంత్రం ఆ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం, గొడౌన్‌లకు సీల్ వేశారు. వినియోగదారులు ఇబ్బంది పడకుండా చూడాలని జేసీ ఆదేశించడంతో సోమవారం గ్యాస్ ఏజెన్సీ నిర్వహణ బాధ్యతను రణస్థలం గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. రికార్డులకు, గోదాంలో ఉన్న స్టాకు వివరాలకు చాలా వ్యత్యాసం ఉందని దీనిపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తానని తెలిపారు.

పరిశోధన రంగం అభివృద్ధితో గుర్తింపు

ఎచ్చెర్ల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): బోధన, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో సాధించిన ప్రగతి ద్వారానే వర్సిటీలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో సోమవారం నిర్వహించిన ఐక్యూఏసీ సమీక్షలో ఆమె పాల్గొని మాట్లాడారు. వర్సిటీలోని అధ్యాపకులు ఈ దిశగా కృషిచేయాలన్నారు. అలాగే వర్సిటీలో సాధించిన ప్రగతిని, అభివృద్ధిని వచ్చే ఏడాది నాక్ బృందం మరోసారి సమీక్షిస్తుందన్నారు. బోధన, పరిశోధనా రంగాల్లో ప్రమాణాలు నెలకొల్పడం, వర్సిటీ పనితీరును మెరుగుపర్చేందుకు అధ్యాపకులు సమిష్టిగా కృషిచేయాలన్నారు. వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ప్రిన్సిపాల్స్ ఎం.అనూరాధ, ఎస్.ఉదయభాస్కర్, సీహెచ్ రాజశేఖరరావు, ఓఎస్‌డీ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



వాహనదారుకి హెల్మెట్ పెడుతున్న సీఐ

శ్రీకాకుళం క్రైం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ దరించలాని ట్రాఫిక్ సీఐ నాగరాజు సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా రాష్ట్రంలో కొత్తగా తీసుకువచ్చిన మోటారు వాహన చట్టాలపై సోమవారం ఏడు రోడ్ల కూడలిలో అవగాహన కల్పించారు. హెల్మెట్‌లు ధరించని వాహనదారులకు అవగాహన కల్పిస్తూ, జరిమానా బదులు వాహనదారులతో హెల్మెట్లు కొనిపించి, వాటి ఆవశ్యకత వివరించారు. రెండో రోజు సోమవారం 120 కేసులు నమోదు చేయగా, రూ.80 వేలు అపరాధ రుసుం విధించారు.

నూతన వాహన చట్టాలపై అవగాహన

సోంపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మోటార్ వెహికల్ నూతన చట్టాలపై సోంపేట పోలీసులు అవగాహన సదస్సును ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఎస్ఐ లవరాజు మాట్లాడుతూ.. వాహనం నడిపే ప్రతివ్యక్తి హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనం నడపాలని తెలిపారు. నూతన చట్టంలో ఉన్న విధంగా నడుచుకోకుంటే భారీగా అపరాధ రుసుం తప్పదన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీ

సరుబుజ్జిలి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ కొత్త ట్రాఫిక్ నిబంధనలు మేరకు పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం ఎస్ఐ బి.హైమావతి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ లేని ద్విచక్ర వాహనాదారులను గుర్తించి అపరాధ రుసుం విధించారు. కొత్త వాహన చట్టాలపై అవగాహన కల్పించారు.

నిబంధనలు పాటించాలి

కవిటి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని కవిటి ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు. ఈ మేరకు కొత్త చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తగా వచ్చిన వ్యక్తులు, అనుమానితులపై స్థానిక పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

సరుబుజ్జిలి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రహదారులు డ్రైనేజీ నిర్మాణ పనులకు ప్రభుత్వ నిధులు మంజూరు చేసినట్టు మండల తెలుగు యువత నాయకులు తాడేల రాజారావు, నూక ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా 204 పనులకు రూ. 18.98 కోట్లు మంజూరైనట్ట తెలిపారు. మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

టేకు కలప పట్టివేత

ఎచ్చెర్ల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కింతలి మిల్లు జంక్షన్‌కు సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన టేకు కలపను సోమవారం అటవీ శాఖాధికారులు సీజ్ చేశారు. కొంతమంది ఫిర్యాదు మేరకు ఫారెస్ట్ ఎస్ఎస్‌వో ఎం.సాయిరాం, బీట్ ఆఫీసర్ బాషా ఈ కలపను పరిశీలించారు. పట్టుబడిన సుమారు 150 దుంగలను కార్యాలయానికి తరలించామన్నారు.

సారా స్వాధీనం

గార, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మత్స్యలేశం సమీపంలో గల సరుగుడు తోటలో సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడిచేసి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేస్తున్న కె.రాజారావు అరెస్టు చేయడంతోపాటు 30 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ ఎంవీ గోపాలకృష్ణ తెలిపారు. ఎస్ఐ ఆర్.మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.





ఒడిశా నుంచి గంజాయి రవాణా

- మహారాష్ట్ర, మాల్దీవులకు..
- రెండు వేర్వేరు కేసుల్లో నలుగురి అరెస్ట్
- వివరాలను వెల్లడించిన డీఎస్పీ వెంకట అప్పారావు



పట్టుబడిన గంజాయి నిందితులతో కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు, సీఐ సూర్యనారాయణ

పలాస, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పలాస రైల్వే స్టేషన్‌లో సాధారణ తనిఖీల్లో భాగంగా వాహనాలను పరిశీలిస్తుండగా రెండు వేర్వేరు కేసుల్లో నలుగురు ఒడిశా గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి..

అప్పు తీర్చేందుకు గంజాయి స్మగ్లర్‌గా మారి..

మహారాష్ట్ర కొల్హాపూర్ జిల్లా సిరోలీ గ్రామానికి చెందిన ప్రకాష్ నరేంద్ర బెహరా అదే రాష్ట్రం ఉస్మానాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సంజయ్ చౌహాన్ వద్ద రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. దీన్ని ఎంతకీ తీర్చకపోవడంతో అప్పటికే గంజాయి రవాణాలో ఆరితేరి ఉన్న చౌహాన్ ఒడిశా నుంచి గంజాయి తీసుకువస్తే అప్పుతీర్చాల్సిన అవసరం లేదని చెప్పడంతో నరేంద్ర బెహరా ఒడిశాలో గంజాయి పండిస్తూ విక్రయిస్తున్న జిత్తు అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసి రెండు దఫాలు గంజాయిని మహా రాష్ట్ర తరలించాడు. మూడో పర్యాయం కూడా 5.8 కిలోల గంజాయిని ఒడిశాలో కొనుగోలు చేసి సోమవారం పలాస రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో సీఐ పి.సూర్యనారాయణ, సిబ్బంది అతడిని ప్రశ్నించి బ్యాగు పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా సంజయ్ చౌహాన్ మహారాష్ట్రలో గంజాయి అమ్ముతూ పోలీసులకు పట్టుబడి జైలు జీవితాన్ని అనుభవిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

కేరళ నుంచి మాల్దీవులకు గంజాయి

ఒడిశా రాష్ట్రంలో కొనుగోలు చేసిన గంజాయిని పలాస నుంచి రైలు మార్గం ద్వారా కేరళ తరలించి అక్కడి నుంచి మాల్దీవులకు సరఫరా చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. తిరువునంతపురం జిల్లా పుతువాల్ గ్రామానికి చెందిన మహీన్ కన్ను అనే వ్యక్తి మాల్దీవుల్లో టూరిస్టు బోటు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. కేరళ రాష్ట్రం భీమాపడి గ్రామానికి చెందిన సెబిలి అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఈయన ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసుకొని మహీన్ కన్నుకు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. ఒడిశా నుంచి గంజాయి తీసుకు వస్తే కిలోకు రూ.10 వేలు ఇస్తానని మహీన్ కన్నుకు చెప్పడంతో ఆయన స్నేహితుడైన మానిక్యవల్లకం గ్రామానికి చెందిన సాజహాన్ హాస్సేన్ సాయంతో ఒడిశాలో గంజాయి పండిస్తూ అమ్ముతున్న శశిర్‌కుమార్‌సింగ్‌ను సంప్రదించారు. అతని బావ మరిది పితర్‌బీర బైక్‌పై 21.14 కిలోల గంజాయిని తీసుకువచ్చి మహీన్ కన్ను, సాజహాన్‌హాస్సేన్‌కు అప్పగిస్తుండగా ముగ్గుర్ని అరెస్టు చేసి వారి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు కేసుల్లో నలుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయితో పట్టుబడితే వారి ఆస్తులు సైతం స్వాధీనం చేసుకొని వేలం నిర్వహించడం జరుగుతుందని హెచ్చరించారు. యువత చెడువ్యసనాలకు గురై విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నా రని, గంజాయి తాగినా, అమ్మినా, రవాణా చేసి పట్టుబడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సమావేశంలో సీఐ పి.సూర్యనారాయణ, ఎస్ఐ చంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి: ఎస్పీ



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

టెక్కలి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు, పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్లను పరిశీలించారు. విజిబుల్ పోలీసింగ్, నూతన ఎంవీ చట్టాలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాద నివారణ చర్యలపై అవగాహన కలిగించారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టేందుకు రాత్రి గస్తీ పెంచాలని సీఐ విజయ్‌కుమార్‌కు సూచించారు.

గంజాయి మత్తులో ఘాతుకం!

(ఐదో పేజీ తరువాయి)

కేవీటీ సూర్యనారాయణ చెప్పారు. సంఘటన ప్రాంతానికి చేరుకుని ఆ మృతదేహం తన తల్లిదిగా గుర్తించి విలపించారు.

ఇంటి వద్ద నుంచే గలాటా..

గన్నెమ్మ ఇంటి వద్ద నుంచే ఆగంతకుడు దాడికి పాల్పడినట్లు ఆనవాళ్లు కనిపించాయి. ఇంటిముందు భాగంలో వృద్ధురాలి చెప్పులతోపాటు పూలు కూడా ఉన్నాయి. అక్కడ నుంచి సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద గన్నెమ్మ చీర పడి ఉంది. అక్కడికి కొంత దూరంలో రక్తం మరకలు ఉండగా.. పక్క రోడ్డులో గన్నెమ్మ మృతదేహం కనిపించింది. గంజాయి మత్తులోనే ఆగంతుకుడు ఈ ఘటనకు పాల్పడ్డాడనే ప్రచారం సాగడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

క్రైం కార్నర్

బెట్టింగ్ యాప్‌ల జోలికి పోవద్దు



ప్లకార్డులతో అవగాహన

కాశీబుగ్గ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌లతో తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉన్నందునవాటి జోలికి యువత పోవద్దని వజ్రపుకొత్తూరు డిప్యూటీ తహసీల్దార్ మురళి, పలాస ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడు గోపాల్ అన్నారు. సోమవారం కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ నుంచి కాశీబుగ్గ పాత బస్టాండ్ వరకు ప్ల కార్డులు పట్టుకుని అవగాహన ర్యాలీ చేపట్టారు. యువత విలువైన సమ యాన్ని ఇటువంటి వాటిపై కన్నా చదువుపై ఉంచి తల్లిదండ్రుల ఆశయాలకు నెర వేర్చాల న్నారు. కార్యక్ర మంలో సంఘాల నేతలు ప్రసాద్, సంపతిరావు జయరామ్, దివాకర్, కార్తీక్, శేఖర్, తేజ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయాలి



కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న 31వ వార్డు ప్రజలు

పలాస, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మా వార్డులో తాగునీరు లేక అల్లాడుతున్నామని, ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని పురుషోత్తపురం, ఎస్సీ వీధి, 31 వార్డు ప్రజలు డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం కమిషనర్ రామారావు, ఛైర్మన్ బళ్ల గిరిబాబుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కొరికాన శంకర్, టి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి గోకార్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు

టెక్కలి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నుంచి 7వ తేదీ వరకు జాతీయస్థాయి గోకార్టింగ్ చాంపియన్‌షిప్ సీజన్-2 పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు తమిళ నాడు, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 17 బృందాల్లో 500 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. ఆటోమొబైల్ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు, విద్యార్థుల్లో దాగివున్న సృజనా త్మకతను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించనున్నామని తెలిపారు. ఈ పోటీలకు కన్వీనర్‌గా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు వ్యవహరిస్తారన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని ఆదాయం రూ.8.58 లక్షలు

జలుమూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలో మహా శివరాత్రి సందర్భంగా రూ.8.58 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. ముఖలింగేశ్వర ఆలయంలోని హుండీలను సోమవారం తెరిచి లెక్కించారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,00,260, కేశఖండన టిక్కెట్ల ద్వారా రూ.1560, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ.2320, స్వామివారి ఫొటోల ద్వారా రూ.530, పులిహోర ప్రసాదం విక్రయం ద్వారా రూ.1,03,440, హుండీల ద్వారా రూ.4,76,185లు, ఇతరత్రా రూ.74.500 ఆదాయం వచ్చిందన్నారు. ఆమదాలవలస దేవాలయ ఈవో టి.రవి పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో అర్చకులు, సత్యసాయి సేవకులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడాలి

పలాసరూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులకు రక్షణ కరువవుతోందని, జీవ వైవిధ్య రక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి, పశు సంవర్ధకశాఖ ఏడీ పి.చంద్రశేఖర్, ఎంపీడీవో వసంత్‌కుమార్ అన్నారు. వన్యప్రాణుల దినం సందర్భంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అంతరించిపోతున్న జంతువులు అనేకం ఉన్నాయని, వాటి ఉత్పత్తిని పెంచేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఆవాసాల నాశనం, వాతావరణం మార్పు, వేట, అక్రమ రవాణా నివా రణ చర్యలను గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మెట్ట వైకుంఠరావు, ఇరిగేషన్ అధికారి పి.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీ సమస్యలను పరిష్కరించాలి

నరసన్నపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జయలక్ష్మీనగర్‌లో పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, వాటిని పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు సోమ వారం పంచాయతీ ఈవో ద్రాక్షాయిణికి వినతిపత్రం అందించారు. కాలనీలోని పలు ప్రాంతాల్లో రోడ్లు గోతులై పోయాయని, తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పందుల సంచారంతో పాటు దోమల బెడద ఎక్కువగా ఉందని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈవో పేర్కొన్నారు. రోడ్డు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నామన్నారు.

యూజీసీ జాతీయ సెమినార్‌కు బాలరాజు



హిరమండలం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆధ్వర్యంలో ఈనెల 6, 7 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్న జాతీయ సెమినార్‌కు దుర్భలాపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ముద్దాడ బాలరాజుకు ఆహ్వానం అందింది. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న ఈ సదస్సులో 'భారతీయ విద్యా విధానాలు, నూతన దృక్పథాలపై' ప్రసంగించే అవకాశం లభించిందని ఆయన తెలిపారు. అలాగే గూనభద్ర గ్రామానికి చెందిన విద్యావేత్త అంపిలి ప్రశాంత్ కుమార్ 'ఎడ్యుకేషన్ పర్‌స్పెక్టివ్స్ అండ్ రోల్ ఆఫ్ టీచర్ ఎడ్యు కేషనల్ ఇన్ ఇండియా' అనే అంశంపై ప్రసంగించనున్నారు.

దేవాలయ భూముల ద్వారా రూ.1.09 లక్షల ఆదాయం

పాతపట్నం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని దేవాలయ భూముల ద్వారా ఏడాదికి రూ.1,09,889 ఆదాయం రానుందని ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. స్థానిక శ్రీనీలకంఠేశ్వరుని ఆలయ ప్రాంగణంలో సోమవారం దేవాలయ భూములకు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంలో 39 మంది రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఈవో పి.మానశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై రాగుచేలతో ప్రమాదాలు



రోడ్డుపై రాగుచేలపై పడిపోయిన మహిళా ఉద్యోగి

టెక్కలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నౌపడా- మెళియాపుట్టి మార్గంలో పలు చోట్ల రైతులు రోడ్లపై రాగు చేలు వేయడంతో ద్విచక్ర వాహన చోదకులు పల్టీలు కొడుతున్నారు. సోమవారం నర్సింగపల్లి సమీపంలో ఓ మహిళా ఉద్యోగి రోడ్డుపై వస్తూ రాగుల చేలపై వాహనం స్లిప్ అయి పడి పోయారు. వెంటనే స్థానికులు ఆమెకు సహాయక చర్యలు చేపట్టారు. అయితే ఇలా రోడ్లపై రాగు చేలపై ఎంతోమంది పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మానవసేవే.. మాధవసేవ

- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి



అనుగ్రహభాషణం చేస్తున్న చిన్న జీయర్, హాజరైన భక్తులు



టెక్కలి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మానవసేవే మాధవసేవ అని, ప్రతి ఒక్కరు దీనిని ఆచరించాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి అన్నా రు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో సోమ వారం రాత్రి శ్రీరామ పాదుకా పట్టాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. మానవుడు పశు పక్ష్యాదులను ప్రేమించాలని, చెట్లను నాటాల న్నారు. హైందవ ధర్మాన్ని రక్షించాలని గుర్తుచేశారు. ఒత్తిడిని జయించాలంటే దైవ చింతన తప్పనిసరి అని, స్వార్థ బుద్ధిని విడనాడాలన్నారు. వికాస తరంగిణి ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామని, మహిళ ఆరోగ్యభద్రత కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. శ్రీరామ పాదుకల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి ప్రతినిధులు వర్మ, మూల వేమన, లమ్మత మధు, రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర భక్త బృందం, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండి గ్రామాలను బలోపేతం చేయాలి

నందిగాం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అందరూ కలిసికట్టుగా ఉండి గ్రామాలను బలోపేతం చేసుకోవాలని త్రిదండి చిన్న జీయర్ స్వామి హితవుపలికారు. సోమవారం దిమిలాడ, మద్దిలివానిపేట గ్రామాల్లో పర్యటించారు. ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెలగడం ద్వారా అభివృద్ధి సాధించ వచ్చు న్నారు. శ్రీరాముని పాదుకలను ప్రతి ఇంట ప్రతిష్ఠించుకొని ఆయన అనుగ్రహాన్ని, శక్తిని సంపాదించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షుడు బాలకృష్ణ, రాంబాబు, కె.బాల కృష్ణ స్వామి పాల్గొన్నారు.

భావవేద కళాశాలలో..

కోటబొమ్మాళి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): చలమయ్యపేట వద్ద కొండపై నిర్మించిన భావవేద కళాశాలలో సోమవారం త్రిదండి చిన్న జీయర్ స్వామి యాగం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



గోపూజలో పాల్గొన్న చిన్న జీయర్ స్వామి

సంతబొమ్మాళి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని త్రిదండి చిన్న జీయర్ స్వామి అన్నారు. కోటబొమ్మాళి మండలం తర్లి పేట వద్ద వేదిక్ ఆశ్రమంలో భక్తులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక విలువలు పెంపొందించుకోవాల న్నారు. ప్రకృతిని ఆరాధించా లని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. తర్లికొండపై ఆయుర్వేద ఆసుపత్రి, కళాశాల నిర్మించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. అనంతరం గోపూజ చేశారు. కార్య క్రమంలో సామాజిక వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీలు తయారుచేసే ఉత్పత్తులతో భరోసా

పోలాకి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్వయంశక్తి సంఘాల మహిళా సభ్యులు తయారుచేసే ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ ఆర్థికంగా భరోసా కల్పిస్తోం దని వెలుగు ఏపీఎం గోరు రాజారావు తెలిపారు. సోమవారం పిన్నింటిపేట, ఈదులవలస, బెలమర గ్రామాల్లో స్వయంశక్తి సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో 5800 మంది సభ్యులను సర్వే చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారన్నారు. ఈ మేరకు సీసీలు, సీఎఫ్‌లకు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఎస్‌హెచ్‌జీలు తయారుచేసిన ఉత్పత్తులు, పథకాలపై సర్వే చేసి నివేదిక అందిస్తారన్నారు. జాతీయస్థాయిలో వస్తుప్రదర్శనకు అవకాశం కల్పిస్తారన్నారు. సంఘాల సభ్యులంతా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఈదులవలస సీసీ లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్

పలాస, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో ప్లాస్టిక్ అమ్మకాలు, వినియోగంపై నిషేధం అమలులో ఉందని, దీనిని మరింత కట్టుదిట్టం చేసేందుకు సచివాలయాల ఉద్యోగులతో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామా రావు అన్నారు. సోమవారం కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో 9 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. వీరు ప్రజల్లో అవగాహన కలిగించడం, దుకాణాలపై దాడులు చేసి ప్లాస్టిక్ విక్ర యిస్తే కేసులు నమోదు చేస్తారన్నారు.

అంత భూమి లేదంట!

(ఐదో పేజీ తరువాయి)

చెబుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కుప్పం నియోజకవర్గంలో ఉన్న మాదిరిగా సీఓఈ కేంద్రం నిర్వహణ జరగాల్సి ఉంది. తక్కువ స్థలంలో అటువంటి సంస్థ పెట్టినా ప్రయోజనం శూన్యమనేది నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే కేంద్రం రూ.10కోట్లుకు పైగా నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉంది. స్థలాలు ఇవ్వడానికి ముందుకు రాకపోతే మరో జిల్లాకు, మరో రాష్ట్రానికి వెళ్లిపోయే ప్రమాదం ఉంది. కేంద్రం సానుకూలంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ముందుకు రాలేకపోతుందో తెలియాల్సి ఉంది.

- ప్రయోగశాలలు ఏవీ?

ప్రస్తుతం మన రాష్ట్రంలో జీడి పంటలకు సంబంధించి బాపట్ల వ్యవసాయ పరిశోధన కేంద్రంలో తప్ప.. మరెక్కడా ప్రయోగశాలలు లేవు. అక్కడ కూడా అరకొరగా మాత్రమే జీడి కేంద్రం నిర్వహణ జరుగుతోంది. మన జిల్లాలో నైర వంటి వ్యవసాయ విద్యాలయం ఉన్నా, జీడికి అందులో భాగస్వామ్యం కల్పించలేదు. పలాసకు మంజూరైన సీవోఈకి అన్నీ హంగులు కల్పిస్తే బాపట్లకు మించి జీడిపై పరిశోధనలు జరిగే అవకాశం ఉంది. 2019 తితలీ తుఫాను తరువాత జీడి రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. మొత్తం 40ఏళ్లకు పైగా పండించిన పంటంతా ఒక్క గాలివానకు ఎగిరిపోయింది. ఇప్పుడిప్పుడే కొత్త మొక్కల ద్వారా ఆదాయం వస్తున్నా.. అవి నామమాత్రపు ఫలితాలు ఇస్తున్నాయి. జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటైతే అటువంటి ఇబ్బందులు లేకుండా రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది. దీనిపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సీవోఈ ఏర్పాటుకు అనువైన స్థలం రెవిన్యూశాఖ కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జీడి రైతులు కోరుతున్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- డ్వామా పీడీ సుధాకరరావు



పలాస రూరల్: లక్ష్మీపురంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సుధాకరరావు

పలాసరూరల్,మార్చి3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని డ్వామా పీడీ బి.సుధాకర రావు ఆదేశించారు. లక్ష్మీపురం గ్రామంలో రూ.14 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల వివరాలను ఎప్పటికప్పుడు నివేదిక రూపంలో అందించాలన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పీవో నారాయణరావు, ఈసీ అమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు చేరుకోకుంటే చర్యలు తప్పవు

నరసన్నపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యా లను సాధించాలని, లేకుంటే చర్యలు తప్పవని డ్వామా పీడీ పి.సుధాకరరావు హెచ్చరించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో క్లస్టర్‌స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూగర్భ జలాలు పెంపొందించేలా ఫారంపాండ్స్, ఇంకుడు గుంతల పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ కె.లోకేశ్వరరావు, ఏపీవోలు, ఈసీలు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో సంక్షేమానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే శిరీష



పలాస, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడు దల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్ సంక్షే మం, అభివృద్ధికి కేటాయించి స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు వేశారన్నారు. గత పాలకులు చేసిన విధ్వంసాల నుంచి వ్యవస్థను పునరుద్ధరిస్తూ రాష్ట్రాన్ని పునర్నిర్మించేలా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా వెలుగొందడం ఖాయమని ఆమె పేర్కొన్నారు.

కొసమాళ 'ఎత్తిపోతల'కు కదలిక

మెళియాపుట్టి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కొసమాళ ఎత్తిపోతల పథకానికి సంబంధించి నిధుల మంజూరుకు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపడంపై గ్రామస్థుల్లో హర్షం వ్యక్తమవుతోంది. వైసీపీ ప్రభుత్వంలో సాగునీటికి నిధులు మంజూరు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బొచ్చు ప్రసాదరావు తదితరులు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.3.49 కోట్లను మంజూరు చేసి భూమి పూజ చేశారు. అయితే గడచిన ఐదేళ్లలో ఈ పనులపై నీలినీడలు అలముకున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి చొరవతో ప్రస్తుతం రూ.4.10 కోట్లకు అంచనా పెంచి ఆర్థిక శాఖ అనుమతికి పంపారు. ఈ మేరకు రైతులు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గోవిందరావులకు అభినందనలు తెలిపారు.

నాణ్యమైన కూరగాయలను ఉపయోగించాలి

పాతపట్నం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన కూరగాయలను వినియోగించాలని తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ హెచ్‌ఎం గౌరీశ్‌కి సూచించారు. బైదలాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సోమవారం సందర్శించారు. మెనూను పరిశీలించారు. కూరగాయలు నాణ్యంగా లేవని తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలించారు పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. పాఠశాల ఆవరణలో నుంచి గ్రామాలకు రోడ్డు ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని తహసీల్దార్ తెలిపారు.

న్యూస్ బాక్స్

ఆక్రమణల తొలగింపు

కొత్తూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఆకులతంపర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన షెడ్లను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించినట్లు తహసీల్దార్ రవిచంద్ర తెలిపారు. సోమవారం గ్రామంలో పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను తొలగించారు. గ్రామ గోర్జి పోరంబోకు భూమిని ఆక్రమించి ఆక్రమణదారు బోరు వేసి వాడుకోవడం వల్ల ఇబ్బందిగా ఉందని సర్పంచ్ నాగళ్ల అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్డీవో ఆదేశాలతో ఆక్రమణలను తొలగించామన్నారు.

8న మండల సమావేశం

పలాసరూరల్,మార్చి3(ఆంధ్రజ్యోతి): మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 8న ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వసంత్ కుమార్ తెలిపారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆ ప్రకటనలో ఆయన కోరారు.

ట్యాంకర్‌తో నీటి సరఫరా

హిరమండలం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ హిరమండలం చిన్నకోరాడ వీధిలో తాగునీటి ఇబ్బందుల నేపథ్యంలో సోమవారం ట్యాంకర్‌తో నీటి సరఫరా చేశారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచనలతో హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ ట్యాంకర్ అందించగా పంచాయతీ సిబ్బంది నీటిని సరఫరా చేశారు.

యాజమాన్య పద్ధతులతో లాభాలు

వజ్రపుకొత్తూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని పశుసంవర్ధక శాఖ జేడీ మట్ట రవికృష్ణ అన్నారు. సోమవారం అనంతగిరి గ్రామంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీష్ ఆధ్వ ర్యంలో గొర్రెలు, మేకల పెంపకందార్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. పశువులకు తరచూ సోకే వ్యాధులు, వాటి నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి మెట్ట పాపారావు, టీడీపీ నాయకులు మరడ దుర్యోధనరెడ్డి, ఉంగ భుజంగరావు, రైతులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు చట్టాలు

హరిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను అమలు చేస్తోందని, వీటిపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. హరిపురంలోని ఒక ప్రైవేటు డిగ్రీ కళాశాలలో సోమవారం సమావేశం నిర్వహించారు. పోక్సో చట్టం, గృహహింసతో పాటు ప్రభుత్వం బాలికలు, మహిళల కోసం ఏర్పాటు చేసిన చట్టాలను వివరించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా సమాజంలో మహిళల పాత్రపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రానీయొద్దు

మెళియాపుట్టి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకో వాలని ఎంపీడీవో ప్రసాద్ పండా తెలిపారు. సోమవారం చాపరలో తాగునీటి పథకాన్ని పరిశీలించారు. నీటి పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలన్నారు. ప్రతి వీధికి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామారావు, కార్యదర్శి అప్పారావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

కోటబొమ్మాళి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. సోమవారం జర్జంగి సమీపంలో హైవేపై వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ పెట్టుకోకపోతే కేసులతో పాటు జరిమానాలు విధిస్తామన్నారు. కార్యక్రమంలో దుర్గారావు పాల్గొన్నారు.